స్వర్ణ భారత జ్యోతి
తెలుగు దినపత్రిక
APTEL/2007/20124
ప్రసురణ : రంగా రెడ్డి, సంపుటి : 18 సంచిక : 347 ఎడిటర్.. చెరుకు జగన్ గౌడ్ పేజిలు : 04, వెల రూ. 1రూ/ ఆదివారం - 31- మే - 2026

రిపోర్టర్స్ కావలెను
పత్రికా రంగంలో అనుభవం కలిగిన రిపోర్టర్లు జిల్లా, నియోజకవర్గ ఇన్చార్జిలుగా, మండల రిపోర్టర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువకులకు కావలెను.
ఫోన్ నెంబర్ : 966282126



## ప్రాజెక్టుల పూర్తికి తగడువు విధించండి: సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదు
- "ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవ తేదీలు ప్రకటించాం
- పెద్ద పరిశ్రమలను 18 నెలల్లోగా ఉత్పత్తి ప్రారంభించాలి
- . దశాబ్దాల తరబడి జాప్యం చేయడం సరైన విధానం కాదు'

## ప్రజాప్రతినిధులు వారంలో ఒకరోజు
# క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే
### కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు

- ★ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా
- ★అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..
- ★సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారమేనా.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల గురించి చెప్పరా?
- ★పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి చురక




హైదరాబాద్: ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. "మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి. మిగతా 2 లో

## రాజస్థాన్‌లోని పలు జిల్లాలను
## ముంచెత్తిన ఇసుక తుఫాను




రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం

అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం



## రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి
# 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు

- డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి: సీఎం చంద్రబాబు
- ఫిర్యాదు అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు
- ఆరు స్తంభాల వ్యవస్థతో సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రణాళిక
- ఏపీలో నేరం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని సీఎం స్పష్టం

అమరావతి: "డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" మిగతా 2 లో

# పోలవరం అడవుల్లో పులి సంచారం..
# అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు
### పులి దాడిలో 9 దూడలు మృతి చెందడంపై అధికారుల అప్రమత్తం



అమరావతి: పోలవరం జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. మిగతా 2 లో

పులిని బంధించాలని అటవీ శాఖకు డిప్యూటీ సీఎం ఆదేశం

అధునాతన టెక్నాలజీతో 24 గంటల పర్యవేక్షణకు ఏర్పాట్లు

నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలి




## హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం

- చెరువు మధ్యలో కట్ట నిర్మించి.. రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా
- చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను కూల్చివేసిన హైడ్రా
- రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు
- చెరువు సరిహద్దులకు కంచె వేసి పరిరక్షణ చర్యలు ప్రారంభం




## రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం
# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

- మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,
- తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోంది
- రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు: కిషన్ రెడ్డి
- రైతులు ఇబ్బంది పడుతుంటే.. మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని విమర్శ

హైదరాబాద్: మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, మిగతా 2 లో

## ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం..
## భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం: ఆర్మీ చీఫ్




వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి, వనరుల నిర్వహణకు ఏఐ తప్పనిసరి అని వెల్లడి

యుద్ధక్షేత్రంలో డ్రోన్ల వినియోగం, కౌంటర్ అటాక్ సామర్థ్యం పెంచుకోవాలని సూచన

భారీ వనరుల నిర్వహణకు ఆటోమేషన్, ఏఐ ఎంతో అవసరమని స్పష్టీకరణ

## సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని
# ప్రజలు బాగా గుర్తించారు
### దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి

- "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు
- మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు
- రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు.



అమరావతి: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్దీ సైకోలో ఫ్రస్ట్రేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. మిగతా 2 లో

## నిన్ను దీవానాగాడు అంటే తప్పా?
# ధిమాక్ లేనోడు అంటే తప్పా?"
### నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు: కేటీఆర్

- ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్
- గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య
- కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ



హైదరాబాద్: తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత మిగతా 2 లో

## మరో ఆపరేషన్ సిందూర్‌కు సైన్యం సిద్ధం..
## ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు




త్రివిధ దళాల మధ్య సమన్వయం పెంపు

ఆధునిక యుద్ధ తంత్రంపై ప్రత్యేక దృష్టి

సరిహద్దుల్లో నిరంతర నిఘా ఏర్పాట్లు

సైనికులు, పౌరుల రక్షణకు ప్రాధాన్యం

అధికారిక సమాచారాన్నే నమ్మాలని ప్రజలకు పిలుపు

## సీఎల్పీ సమావేశానికి ముందే
# గవర్నర్‌తో డీకే భేటీ
### గవర్నర్‌ను కలిసిన డీకే శివకుమార్.. ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై చర్చ

ముఖ్యమంత్రిగా తన ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై చర్చించినట్లు ఊహాగానాలు

ప్రమాణ స్వీకారానికి జూన్ 3వ తేదీని దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం

మరోవైపు డిప్యూటీ సీఎం పదవి కోసం కాంగ్రెస్‌లో తీవ్రస్థాయిలో లాబీయింగ్



కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అనూహ్యంగా పావులు కదిపారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరగడానికి ముందే ఆయన శనివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తన సోదరుడు, మాజీ ఎంపీ మిగతా 2 లో

## రాజస్థాన్‌లోని పలు జిల్లాలను
# ముంచెత్తిన ఇసుక తుఫాను

రాజస్థాన్: రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

## ప్రాజెక్టుల పూర్తికి తగడువు విధించండి
# సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి: రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని, వాటి పూర్తికి కచ్చితమైన కాలపరిమితి నిర్దేశించుకుని పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్టీసీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులతో పాటు దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల పనులపైనా చర్చించారు. "ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవ తేదీలు ప్రకటించాం. పెద్ద పరిశ్రమలను 18 నెలల్లోగా ఉత్పత్తి ప్రారంభించాలని చెబుతున్నాం. అదే తరహాలో ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను పూర్తి చేయాలి. దశాబ్దాల తరబడి జాప్యం చేయడం సరైన విధానం కాదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల సమీకరణ, టెండర్ల ప్రక్రియ వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆర్టీసీపై జరిగిన సమీక్షలో, సంస్థ ఆస్తులను సద్వినియోగం చేసుకుని, బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈవీ బస్సుల కొనుగోళ్లపై కూడా అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం

హైదరాబాద్: హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి సమీపంలో ఉన్న ముష్కిన్ చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. సుమారు రూ.5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. వివరాల్లోకి వెళితే, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముష్కిన్ చెరువుపై కన్నేశారు. పేదలతో గుడిసెలు వేయించి, భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామ రికార్డుల ప్రకారం 59.11 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు మధ్యలో ఏకంగా మట్టితో కట్ట నిర్మించి, 34 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసేందుకు ప్లాన్ చేశారు. ఈ విషయంపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు, ఆక్రమణదారులకు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను, గుడిసెలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దుల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం..
# భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం: ఆర్మీ చీఫ్

ఢిల్లీ: ఆధునిక యుద్ధ క్షేత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని, వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న యుద్ధ తంత్రంలో వస్తున్న సంక్లిష్టతలను అధిగమించేందుకు కొత్త టెక్నాలజీలు తప్పనిసరిగా అవసరం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం నాడు పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో 150వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌ను సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యుద్ధ క్షేత్రాలు భారీ స్థాయిలో సమాచారాన్ని సృష్టిస్తున్నాయని, అనేక రకాల వనరులు ఇందులో భాగమవుతున్నాయని జనరల్ ద్వివేది వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో కమాండర్లు, సైనికులు వేగంగా సమాచారాన్ని విశ్లేషించి, తక్షణమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. "యుద్ధ వేగం ఎక్కువగా ఉన్నప్పుడు, వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అదనపు సాంకేతిక మద్దతు అవసరం. ఇక్కడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవసరం ఏర్పడుతుంది. భారీ వనరులను ఒకేసారి నియంత్రించడం కష్టమైనప్పుడు ఏఐ సాయపడుతుంది" అని ఆయన తెలిపారు. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో 'అబ్జర్వ్, ఓరియెంట్, డిసైడ్, యాక్ట్' (ఓడీఏ) అనే సైకిల్ ఉంటుందని, సంక్లిష్ట పరిస్థితుల్లో దీనిని వేగవంతం చేసేందుకు ఏఐ టెక్నాలజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటివి సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేయడానికి, వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి దోహదపడతాయని అన్నారు. ఇదే సమయంలో సైనిక కార్యకలాపాల్లో డ్రోన్ల పాత్ర కూడా గణనీయంగా పెరిగిందని జనరల్ ద్వివేది హైలైట్ చేశారు. "ప్రస్తుత వాతావరణంలో, శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు అధికంగా ఉంది. వాటిని ఎదుర్కోవడానికి మనకు కౌంటర్-డ్రోన్ వ్యవస్థలు అవసరం. అదే సమయంలో, మన డ్రోన్లను కూడా సమర్థంగా ఉపయోగించుకోవాలి. యుద్ధ క్షేత్రంలో వనరులు భారీగా పెరిగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. డ్రోన్లు, సెన్సార్లు, నిఘా పరికరాలు వంటి వాటిని సమర్థంగా నిర్వహించడానికి ఆటోమేషన్ తప్పనిసరి అని, ఇందుకు ఏఐ కీలకమైన సాధనంగా నిలుస్తుందని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు.

# మరో ఆపరేషన్ సిందూర్‌కు సైన్యం సిద్ధం..

ఢిల్లీ: భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం త్రివిధ దళాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సరిహద్దుల్లో ప్రస్తుత ప్రశాంతత కేవలం తాత్కాలికమేనని తెలిపారు. శత్రు దేశాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని స్పష్టం చేశారు.

పటిష్ఠంగా వ్యూహాలు

ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా త్రివిధ దళాల మధ్య సమన్వయం పెంచుతున్నట్లు ద్వివేది తెలిపారు. యుద్ధరంగంలో ప్రతి కదలిక స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. అందుకే సైనికులతో పాటు పౌరుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 24 గంటలూ రక్షణ దళాలు అప్రమత్తంగా ఉంటున్నాయని వివరించారు.

సమాచార యుద్ధంలో ప్రజల పాత్ర

సమాచార యుద్ధంలో విజయం సాధించాలంటే దేశ ప్రజల మద్దతు ఎంతో అవసరమని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజలు విశ్వసించాలని పిలుపునిచ్చారు. దేశమంతా ఒకే తాటిపైకి వచ్చినప్పుడే శత్రువుపై విజయం సాధ్యమవుతుందని వివరించారు.

## రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం
# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

హైదరాబాద్: మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళారులు, రైస్ మిల్లర్ల చేతుల్లో చిక్కి రైతులు విలవిలలాడుతుంటే, మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని మండిపడ్డారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టేయాలని చూస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ఎప్పుడూ తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని స్పష్టం చేశారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందానికి గాను, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగలిగిందని గణాంకాలను వెల్లడించారు. ఇక్కడ పండే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ, పేద ప్రజలకు మాత్రం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చిన నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం కమీషన్లు, భూ దందాలపైనే శ్రద్ధ పెడుతూ, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?"

హైదరాబాద్: తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## ప్రజాప్రతినిధులు వారంలో ఒకరోజు
# క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే

మొదటి పేజి తరువాయి

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, సీనియర్ నాయకులు వారంలో ఒకరోజు నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలను కలవాలి. నాతో సహా ఎవరు ఎక్కడికి వెళ్లాలనేది పీసీసీ అధ్యక్షుడు నిర్ణయిస్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ క్యాడర్.. సోషల్ మీడియా వారియర్లుగా మారి పార్టీ కోసం పనిచేశారు. కానీ, ఇప్పుడు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ప్రచారం చేసుకోవడమే తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనీయడం లేదు. పార్టీ కోసం సోషల్ మీడియా వినియోగంపై ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వాలి.

### 'సర్'పై సమన్వయంతో పనిచేయాలి..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(సర్)పై పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి. నేతలు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు పోలింగ్ బూత్ స్థాయిలో పనిచేస్తారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించాలి. నగర పరిధిలోని 15 నియోజకవర్గాలవారీగా 'సర్'పై సమావేశాలు పెట్టాలి. మహిళా కాంగ్రెస్ తరఫున క్లస్టర్ల వారీగా భేటీలు నిర్వహించాలి. 'సర్'లో భాగంగా ఓట్ల తొలగింపుతో సామాన్యులు, పేదలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం. లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చు. దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యలకు పరిష్కారంపై అందరూ సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి.

అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..

గతంలో డిజిటల్ విధానంలో ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం. అప్పుడు కీలకపాత్ర పోషించిన వారిని ఇప్పుడు 'సర్' కార్యక్రమంలో పనిచేసేలా పరిగణనలోకి తీసుకోవాలి. 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 'సర్' పర్యవేక్షణకు ఇన్‌ఛార్జులను నియమించాలి. అసెంబ్లీ ఇన్‌ఛార్జులు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. ఈ విషయంలో పీసీసీ మాజీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. దాదాపుగా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేశాం. పార్టీ తరఫున ఇప్పుడు వేల మంది సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. వలస పోయిన వారి ఓట్లు తొలగించకుండా వారంతా జాగ్రత్తలు తీసుకోవాలి" అని సీఎం చెప్పినట్లు పార్టీ వర్గాలు వివరించాయి. 'సర్' విషయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై మంత్రులు, ఇతర నేతలు తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా చెప్పారు. ఒక నాయకుడు మాట్లాడుతుండగా.. సీఎం కల్పించుకుని ముందు గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు?, పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకాలు ఇంకా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించినట్లు తెలిసింది.

## రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి
# 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు

అమరావతి: "డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు శాఖను ఆదేశించారు. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటుంటే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సైబర్ నేర రహితంగా మార్చడమే లక్ష్యమని, ఏపీ ప్రజలను మోసం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో సైబర్ నేరాల కట్టడిపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించిన కార్యాచరణను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఆరు స్తంభాల (6 పిల్లర్స్) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్‌బోర్డ్, టెక్నాలజీ-ఏఐ వినియోగం, పోలీసులకు శిక్షణ, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటివి ఉంటాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో అత్యాధునిక సదుపాయాలతో రాష్ట్రస్థాయి సైబర్ వార్ రూం ఏర్పాటు చేస్తున్నామని, ఇది 30 రోజుల్లో అందుబాటులోకి వస్తుందని డీజీపీ తెలిపారు. సైబర్ మోసంపై ఫిర్యాదు అందిన వెంటనే 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, గోల్డెన్ అవర్ టైంలో స్పందించి బాధితుల డబ్బు బదిలీ కాకుండా చూడాలని సీఎం సూచించారు. ఇందుకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. పోలీసు పెట్రోలింగ్ తరహాలోనే 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిరంతరం జరగాలని చంద్రబాబు అన్నారు. నేరం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడంపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి వీబశ్రీవఎబత్వతీ.ూ× వంటి టెక్నాలజీలను వాడతామని, ఏడాదిలో 500 మంది పోలీసు అధికారులకు శిక్షణ ఇస్తామని డీజీపీ వివరించారు. 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు, 4 ప్రాంతీయ హబ్‌లు ఏర్పాటు చేసి నేరాలకు అడ్డుకట్ట వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎల్పీ సమావేశానికి ముందే
# గవర్నర్‌తో డీకే భేటీ

మొదటి పేజి తరువాయి

తన సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్‌తో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన, గవర్నర్‌తో అనధికారికంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రిగా తనను ఎన్నుకునే పక్షంలో ప్రమాణ స్వీకార ఏర్పాట్లు, తేదీలపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని శివకుమార్ వర్గాలు చెబుతున్నాయి. జ్యోతిష్కులు సూచించిన ప్రకారం జూన్ 1, 3, 5 తేదీల్లో ఒక మంచి ముహూర్తాన్ని ఖరారు చేసే అంశంపై గవర్నర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జూన్ 3వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేందుకు డీకే శివకుమార్ మొగ్గు చూపుతున్నారని, ఈ విషయాన్ని గవర్నర్ కార్యాలయానికి కూడా చేరవేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రమాణ స్వీకార వేదికగా విధాన సౌధ మెట్ల భాగాన్ని గానీ, రాజ్‌భవన్‌ను గానీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో ఉప ముఖ్యమంత్రి పదవుల కోసం తీవ్రమైన లాబీయింగ్ మొదలైంది. లింగాయత్ వర్గం నుంచి సీనియర్ నేతలు ఎం.బీ. పాటిల్, ఈశ్వర్ ఖండ్రే ఈ పదవిని ఆశిస్తున్నారు. అలాగే, మాజీ స్పీకర్ యూటీ ఖాదర్, సీనియర్ ఎమ్మెల్యే తన్వీర్ సైత్, సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడైన జమీర్ అహ్మద్ ఖాన్ కూడా డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారు. ఎస్సీ వర్గం నుంచి సీనియర్ నేతలు జి.పరమేశ్వర, హెచ్.సి. మహదేవప్ప కూడా ఆశలు పెట్టుకున్నారు. అయితే, వివిధ వర్గాల నుంచి తీవ్రమైన పోటీ ఉండటంతో పార్టీలో అనవసర విభేదాలు రాకుండా ఉండేందుకు అసలు డిప్యూటీ సీఎం పదవులే లేకుండా చేయాలనే ఆలోచనను కూడా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొత్త ముఖ్యమంత్రితో పాటు దాదాపు 12 నుంచి 14 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎల్పీ సమావేశం సాయంత్రం 4 గంటలకు జరగనుండగా, అంతకుముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

## సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని
# ప్రజలు బాగా గుర్తించారు

మొదటి పేజి తరువాయి

సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది. ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తున్నాయి" "నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొచ్చు. తెదేపా ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మహిళలకు మొదటినుంచి మా పార్టీ అండగా ఉంది. పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా మనకు నష్టం. ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే ఎవరికీ నష్టం ఉండదు" అని ముఖ్యమంత్రి తెలిపారు.

### బక్కని నర్సింహులు వ్యాఖ్యలు సరికాదు: చంద్రబాబు

తెదేపా జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. హైబ్రిడ్ మహానాడు విజయవంతమైందన్నారు. మహానాడు సందర్భంగా తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. తెలంగాణపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతీయకూడదని సూచించారు. తెలుగు జాతి ఒక్కటేనని చెప్పారు. తెదేపా పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాజ్యసభ స్థానాలకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు ఆయన్ను కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్‌రావు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## పోలవరం అడవుల్లో పులి సంచారం..
# అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

ప్రజలు, పశువుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పులి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల పోలవరం జిల్లాలోని చికిలింత పంచాయతీలో పులి దాడి చేసి 9 దూడలను చంపిన ఘటనపై పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పులి తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దీనిపై సమీక్ష నిర్వహించిన ఆయన, పులి వల్ల మనుషులకు, పశువులకు ఎలాంటి హాని జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డ్రోన్లు, ట్రాప్ కెమెరాల వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని పవన్ సూచించారు. 24 గంటల పాటు నిఘా కోసం ప్రత్యేక 'హనుమాన్' బృందాలను రంగంలోకి దించాలని, అవసరమైతే వాటి సంఖ్యను పెంచాలని అన్నారు. పులిని సురక్షితంగా బంధించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) స్థాయి అధికారి ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, పశువులను కోల్పోయిన రైతులకు తక్షణమే మధ్యంతర పరిహారం అందించినట్లు, పూర్తి నష్టపరిహారాన్ని త్వరలో చెల్లిస్తామని అధికారులు పవన్‌కు వివరించారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని కూడా ఆయన ఆదేశించారు.

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను
# సరిగ్గా నిర్వహించడం లేదు: రాహుల్ గాంధీ

ఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# గాదె వెంకటరెడ్డి మృతిపై రేవంత్ సంతాపం

హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి (85) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాదె వెంకటరెడ్డి రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడు, సహనశీలిగా పేరుగాంచారని, ఆయన హయాంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని రేవంత్ కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభకు ఐదుసార్లు ప్రాతినిథ్యం వహించిన ఆయన, మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఆయన లేని లోటు తీర్చలేనిదని సీఎం పేర్కొన్నారు. 1940 జులై 10న ప్రకాశం జిల్లా పావులూరులో జన్మించిన గాదె వెంకటరెడ్డి న్యాయశాస్త్రం అభ్యసించారు. ప్రజాసేవపై ఉన్న ఆసక్తితో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1967లో పర్చూరు నియోజకవర్గం నుండి తన 27వ ఏటనే తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1991 (ఉప ఎన్నిక), 1994లో పర్చూరు నుండి, అలాగే 2004, 2009లలో బాపట్ల నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. ఉమ్మడి ఏపీలో అగ్ర నేతలైన నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్యల మంత్రివర్గాల్లో దేవాదాయ శాఖతో పాటు పలు కీలక శాఖల మంత్రిగా ఆయన సమర్థవంతంగా సేవలందించారు. కాంగ్రెస్ తర్వాత ఆయన తెలుగుదేశం పార్టీ, వైసీపీలలో కూడా కొనసాగారు. ఒక విలువలతో కూడిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని ముగించి నిష్క్రమించిన గాదె వెంకటరెడ్డి మృతి పట్ల రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## 114 సంస్థలకు 1,269 ఎకరాల భూమిని కేటాయించాం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భూ కేటాయింపులు, నిర్మాణ పనుల పురోగతిపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ కీలక వివరాలను వెల్లడించారు. రాజధానిలో భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతిలో ఇప్పటివరకు మొత్తం 114 సంస్థలకు 1,269 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో 70 ప్రభుత్వ సంస్థలు, 44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. అయితే, ఈ మొత్తం 114 సంస్థల్లో 3 సంస్థలు కొన్ని కారణాల వల్ల తమ కేటాయింపులను రద్దు చేసుకోగా.. మరో 3 సంస్థలకు గతంలో కేటాయించిన స్థలానికి బదులుగా వేరే చోట భూమిని కేటాయించినట్లు మంత్రి వివరించారు. అమరావతిలో స్టూడియోలు లేదా ఇతర సంస్థల స్థాపన కోసం తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనలు రాలేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అయితే, ముంబైకి చెందిన కొన్ని ప్రముఖ సినీ, వ్యాపార సంస్థలు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు, భూముల కోసం ముందుకు వచ్చాయని తెలిపారు. రాజధానిలో భూములు కోరుతూ ముందుకు వచ్చే సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాతే కేటాయింపులు జరుగుతాయని మంత్రి చెప్పారు. అందుకోసం సదరు సంస్థల ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు, బ్యాలెన్స్ షీట్లను సమర్పించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. రాజధాని నిర్మాణ పనులకు ఎలాంటి డీజిల్ కొరత లేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా భారీ నిర్మాణాలను వాయిదా వేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించినప్పటికీ.. అమరావతి రాష్ట్ర భవిష్యత్తు, రాజధాని కావడంతో పనులను ఎక్కడా ఆపకుండా కొనసాగిస్తున్నామని చెప్పారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు ఎంతో నమ్మకంతో తమ భూములను త్యాగం చేశారని, కానీ గత ఐదేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తిగా నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా పనులను నిలిపివేస్తే రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతారని, వారి ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని నారాయణ పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా రాజధాని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## వచ్చే ఏడాది కేటీఆర్ పాదయాత్ర.. కేసీఆర్ బస్సు యాత్ర

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిస్తున్న రాజకీయ పోరుకు మరింత పదును పెట్టేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమైంది. ఎన్నికల హామీల అమలులో వైఫల్యం, ప్రజాసమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనలో అవినీతి, అధికార పార్టీ నేతల అక్రమాలపై ఆరోపణలను ప్రధాన అస్త్రాలుగా మలుచుకోవాలని గులాబీ పార్టీ నిర్ణయించింది. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన కార్మికుల మద్దతు కూడగట్టేలా ప్రభుత్వాన్ని నిరంతరం ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేసే కసరత్తు ప్రారంభించింది.

అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార కాంగ్రెస్ వ్యతిరేక ఓటు చీలి బీజేపీ వైపు మళ్లకుండా రాజకీయంగా అడ్డుకట్ట వేసే వ్యూహం కూడా అవసరమని భావిస్తోంది. యువతను ఆకర్షించే కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగంలో చురుకుదనం పెంచడం, భవిష్యత్‌లో కేటీఆర్ పాదయాత్ర, కేసీఆర్ బస్సు యాత్రల వంటి భారీ ప్రజా కార్యక్రమాలతో మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో దూకుడు పెంచేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అంశాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇప్పటికే వరంగల్‌లో రైతు సదస్సు నిర్వహించిన బీఆర్ఎస్ త్వరలో తెలంగాణ భవన్‌లో యువజన, విద్యార్థి నేతలతో సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. రైతుభరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు హామీలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతర రాజకీయ ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నిర్ణయించింది.

అక్రమాలు, అవినీతి ఆరోపణలను ప్రజల ముందుంచడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ విశ్వసనీయతపై ప్రజల్లో నిరంతరం చర్చ జరిగేలా చూడాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు పార్టీ ముఖ్య నేతలు రేవంత్ ప్రభుత్వంపై రోజుకో ఆరోపణ, విమర్శలతో విరుచుకుపడుతున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పటికే అసెంబ్లీతోపాటు ప్రజా వేదికలు, సామాజిక మాధ్యమాలు, జిల్లా స్థాయిలో కార్యక్రమాల ద్వారా ఈ అంశాలను ప్రజల్లోకి నిరంతరం తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడంపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ, క్రియాశీల కార్యకర్తల గుర్తింపు, యువ నాయకత్వానికి ప్రాధాన్యం వంటి అంశాలపై కార్యాచరణ ప్రారంభించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని మరింత బలోపేతం చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మార్చుకోవడానికి ఇప్పటి నుంచే బూత్ స్థాయి నుంచే పార్టీ వ్యవస్థను పటిష్టం చేసే పనులు ప్రారంభమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మూడు కార్పొరేషన్లలో నెలకొన్న రాజకీయ పరిణామాలను కూడా బీఆర్ఎస్ అత్యంత కీలకంగా చూస్తోంది. 'సర్'పై అవగాహన కార్యక్రమాల పేరిట నగర ఓటర్లతో మరింత సన్నిహిత సంబంధాలు పెంచుకోవాలని పార్టీ యోచిస్తోంది. సర్‌పై కేటీఆర్ గ్రేటర్ పరిధిలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు డిజిటల్ యుగంలో కీలకంగా మారుతున్న 'జెన్ జీ'యువతను ఆకర్షించేందుకు ప్రత్యేక ముఖాముఖి సమావేశాలు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలు నిర్వహించే ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

## రంగారావు సేవలు ప్రశంసనీయం..
## జిల్లా సమాచార శాఖ అధికారి ఎల్. రమేష్.



గుంటూరు, మే 30 కార్యాలయ విధుల పట్ల బాధ్యత, కష్టపడి పని చేసే తత్వం రంగారావు సొంతమని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్. రమేష్ కొనియాడారు. గుంటూరు జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో 36 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ఆఫీస్ సబార్డినేట్ గా సేవలందించి పదవి విరమణ చేసిన కుర్రా రంగారావు కు శనివారం సమాచార శాఖ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. రంగారావు, వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా సత్కరించి పదవీ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి రమేష్ మాట్లాడుతూ ఎటువంటి రిమార్కులు లేకుండా సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసిన రంగారావును నేటితరం ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. చిన్న స్థాయిలోనైనా, పెద్ద స్థాయిలోనైనా కష్టపడి పని చేసే ఉద్యోగులకు గౌరవం తప్పక లభిస్తుందన్నారు. వృత్తి నైపుణ్యం, వృత్తి ధర్మం పాటించిన సీనియర్ ఉద్యోగుల అనుభవాలను తీసుకుని ఉద్యోగ నిర్వహణలో ఆదర్శంగా నిలువవలసిన అవసరం ఉందని వివరించారు. ఈ సమావేశంలో డివిజనల్ పౌర సంబంధాల అధికారులు శ్యాం కుమార్, రవీంద్రబాబు, ఏఈఐఈ కిషోర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఏ వి యస్ వై వి కృష్ణయ్య, టైపిస్టులు బుజ్జి, శివరామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 1న కాకినాడ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన: చామవరంలో భారీ ఏర్పాట్లు

తుని నియోజకవర్గంలో పర్యటించనున్న సీఎం: ప్రజావేదిక ద్వారా ప్రజలతో నేరుగా మమేకం.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సిద్ధం: తునిలో పండుగ వాతావరణం.

భద్రత, సౌకర్యాలపై అధికారులతో సమీక్షించిన ఎంపీ సానా సతీష్ బాబు.



కాకినాడ, మే 30 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల జూన్ 1వ తేదీన కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటన తుని నియోజకవర్గ అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని స్థానిక నేతలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తుని మండలం చామవరం గ్రామంలో సీఎం పర్యటన కోసం యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సాగనున్న ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా, చామవరం గ్రామంలో ఏర్పాటు చేయనున్న 'ప్రజావేదిక' ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సీఎం ప్రత్యేక సమయాన్ని కేటాయించనున్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తో కలిసి శనివారం చామవరం గ్రామంలో పర్యటించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక నిర్మాణం, భారీ బహిరంగ సభకు వచ్చే ప్రజల కోసం కనీస సౌకర్యాలు (నీరు, నీడ, పార్కింగ్) యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీని కోరారు. ముఖ్యమంత్రి రాకతో తుని నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. సీఎం పర్యటనలో భాగంగా పార్టీ క్యాడర్‌తో ప్రత్యేక సమావేశం కూడా ఉండటంతో, నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీ స్థాయిలో తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పర్యటనను విజయవంతం చేసే బాధ్యతను పార్టీ స్థానిక నాయకత్వం భుజాన వేసుకుంది. ఈ పర్యవేక్షణలో ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా, జేసీ అపూర్వ భరత్, పెద్దాపురం ఆర్డీవో, డీఎస్పీ తిలక్, ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ, ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఈశ్వరుడు తదితర రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్, మండల పాక్స్ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చీరాలలో 'ఇసుక మాఫియా' ఆగడాలు
## పట్టపగలే అక్రమ రవాణా.. నిమ్మకు నీరెత్తిన అధికారులు!

చిన్నగంజాం హైవేపై బహిరంగంగా ఇసుక తరలింపు: భయాందోళనలో స్థానికులు, వాహనదారులు.

అధికారుల కనుసన్నల్లోనే దందా? ముడుపులకు అలవాటు పడ్డారా లేక మాఫియాకు భయపడుతున్నారా?

ప్రశ్నిస్తే రౌడీలతో దాడులు: మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల ఉదాసీనతపై తీవ్ర నిరసన.



బాపట్ల జిల్లా చీరాల, మే 30 చీరాల ప్రాంతం ఇప్పుడు ఇసుక మాఫియా కబంధహస్తాల్లో చిక్కుకుంది. చిన్నగంజాం ఫ్లై ఓవర్ సమీపంలో ప్రతిరోజూ పట్టపగలే సాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా చూస్తుంటే... ఈ ప్రాంతంలో అసలు చట్టం ఉందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చి, ట్రాక్టర్ల ద్వారా బహిరంగంగా ఇసుకను తరలిస్తున్నా, బాధ్యతాయుతమైన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక పెద్ద 'మాఫియా దందా' నడుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నగంజాం హైవేపై శనివారం మధ్యాహ్నం సాక్షాత్తు ప్రజల కళ్ల ముందే భారీగా ఇసుకను రవాణా చేస్తున్న దృశ్యాలు చట్టాన్ని ఎగతాళి చేస్తున్నట్లు ఉన్నాయి. కనీసం టార్పాలిన్ కవర్ కూడా వేయకుండా తరలిస్తున్న ఇసుక, గాలికి ఎగిరి వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీనివల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, మాఫియాకు భయపడి సామాన్యులు మౌనంగా ఉండిపోతున్నారు. "మా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నాం, ఈ ఇసుక ట్రాక్టర్ల ఆగడాలు ఎప్పుడు ఆగుతాయో ఎవరికీ తెలియదు" అని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల కార్యాలయాలు ఆ పరిధిలోనే ఉన్నా, ఏ ఒక్క అధికారి కూడా చర్యలు తీసుకోవడానికి ముందుకు రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మాఫియా నుండి అందుతున్న ముడుపులకు అలవాటు పడి, అధికారులు తమ బాధ్యతలను విస్మరించారా? లేక మాఫియాకు ఉన్న రాజకీయ అండదండలు చూసి, ప్రాణభయంతో అధికారులు మౌనం వహిస్తున్నారా? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే ఇసుక మాఫియాకు కనుసన్నల్లో పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని స్థానిక రైతులు మండిపడుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా, క్షేత్రస్థాయిలో ఎటువంటి మార్పు రాకపోవడం గమనార్హం. స్థానిక రైతుల మొరను పట్టించుకోని అధికార యంత్రాంగం, మాఫియా ఆగడాలకు పరోక్షంగా మద్దతు ఇస్తోందని ప్రజలు బహిరంగంగానే చర్చిస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్ ఎస్పీ తక్షణమే స్పందించి, చిన్నగంజాం పరిసరాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై 'స్పెషల్ టాస్క్ ఫోర్స్' తో విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల అండదండలు ఉన్నాయని భావిస్తున్న ఇసుక మాఫియాకు గట్టి బుద్ధి చెప్పాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున రోడ్డెక్కి ఆందోళన చేస్తామని స్థానిక ప్రజా సంఘాలు హెచ్చరించాయి.




# ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



గుంటూరు జిల్లా మే 30 ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. రహదారి భద్రత కమిటీ, మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశాలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. సి.ఆర్.డి.ఏ ప్రాంతంలో సీడ్ యాక్సెస్ రోడ్ పై ప్రమాదాల పట్ల పర్యవేక్షణ చేయాలని సూచించారు. అవసరమైతే బారికేడింగ్ పెట్టాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై గ ట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. నరసరావు రహదారిలో డోకిపల్లి వద్ద ప్రమాదాల నివారణకు రహదారి వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. వెస్ట్రన్ బై పాస్ వద్ద ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు దూరం నుండి కనిపించే విధంగా, ఏ దిశగా వెళ్ళాలో స్పష్టంగా తెలిసే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కర్తవ్యం కావాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. యువతను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని చెప్పారు. విద్యా సంస్థలు, వాటి చుట్టుప్రక్కల ఎట్టి పరిస్థితుల్లోను మాదక ద్రవ్యాలకు చోటు లేకుండా చూడాలని అన్నారు. వివిధ రూపాల్లో ఉంటున్న వాటిని గమనించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప రవాణా కమిషనర్ కే సీతారామిరెడ్డి మాట్లాడుతూ రహదారులపై ఎన్.హెచ్.ఏ.ఐ పరిధిలో 19, రహదారులు, భవనాలు శాఖ పరిధిలో 16 బ్లాక్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని చెప్పారు. జనవరి నుండి ఏప్రిల్ వరకు 307 ప్రమాదాలు జరిగాయన్నారు. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ సేవ్ లైఫ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రమాద రహిత జిల్లాగా చేయాలని గుంటూరు జిల్లాను 2023 డేటా మేరకు ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. అయితే ఇప్పటికే బాగా తగ్గుదల ఉందన్నారు. అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి మాట్లాడుతూ రహదారి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపై తనిఖీలు నిర్వహించి, అపరాధ రుసుము విధించడం జరిగిందని వివరించారు. గుంటూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో 52 హాట్ స్పాట్ లను గుర్తించి, డ్రోన్ ద్వారా నిఘా పెట్టమని తెలిపారు. విద్యా సంస్థలలో ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.ఎస్.కె. ఖాజావలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్.టి.ఓ కె.శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఎం.టి.ఎం.సి అదనపు కమిషనర్ శకుంతల, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, రహదారులు భవనాలు శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, ఎస్.సి కార్పొరేషన్ ఇ.డి డి.దుర్గా భాయి, జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# తునిలో సీఎం పర్యటన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీ, కలెక్టర్

రాజ్యసభ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై ఎంపీ సానా సతీష్ బాబు,

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సుదీర్ఘ చర్చ.

జూన్ 1న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు ఉండకూడదు: అధికారులకు స్పష్టమైన ఆదేశం.



కాకినాడ/తుని, మే 30 కాకినాడ జిల్లాలో రాజ్యసభ సభ్యుల నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించేందుకు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మౌలిక వసతుల కల్పన, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై వారు సమీక్షించారు. అనంతరం జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుని పర్యటన ఖరారు కావడంతో, కలెక్టర్‌తో కలిసి ఎంపీ సానా సతీష్ బాబు నేరుగా తుని చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు.రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తుని నియోజకవర్గంలో ప్రజలందరికీ అసౌకర్యం కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాము. జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ చూపుతున్నారు. తుని పరిసరాల్లోని మత్స్యకార గ్రామాల సమస్యలను, స్థానిక వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటనలో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఆయన పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి పార్టీ శ్రేణులు, అధికారులు సిద్ధమవుతున్నారని" తెలిపారు.జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ నిర్మాణం, బహిరంగ సభ వేదిక, వీఐపీల భద్రత, పార్కింగ్ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ముఖ్యంగా రాబోయే రుతుపవనాలను దృష్టిలో ఉంచుకుని బహిరంగ సభ ప్రాంగణం జలమయం కాకుండా డ్రైనేజీ వ్యవస్థను సిద్ధం చేశాము. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశాము. ఎక్కడా ఎటువంటి చిన్న లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తాం. అధికారులు కేటాయించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించాము" అని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తుని నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు జరుపుతున్న ఈ పర్యటన రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో పెండింగ్‌లో ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులు తుని పట్టణ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఈ పర్యటనలో కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని స్థానిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటనలో భాగంగా సీఎం స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై, నియోజకవర్గంలో పారిశ్రామి కాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎండ వేడిమి నుండి ఉపశమనం కోసం ప్రత్యేక షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ యంత్రాంగాన్ని ఆదేశించారు.

## గ్రీనరీ పెంపుపై దృష్టి: పార్కులు, డివైడర్లలో మొక్కలు నాటాలని కమిషనర్ కే. మయూర్ అశోక్ ఆదేశం.



గుంటూరు నగర పాలక సంస్థ మే 30 అఖండ సూర్య రానున్న వర్షాకాలంలో గుంటూరు నగరంలో గ్రీనరి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. శనివారం నగర పాలక సంస్థలోని ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ నందు రానున్న వర్షాకాలంలో గ్రీనరి అభివృద్ధి మరియు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల పై వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంలో గుంటూరు నగరంలో గ్రీనరీని అభివృద్ధి చేయడానికి పార్కులు మరియు సెంట్రల్ డివైడర్లలో మొక్కలను విరివిగా నాటాలని, పార్కులలో ఉన్న సిబ్బంది అందరికి విధులు కేటాయించాలని ఆదేశించారు. అలాగే అత్యవసర సమయాల్లో భారీ గాలులతో వర్షాలు కురిసే సమయాల్లో భారీ వృక్షాలు పడిపోయే సమయాల్లో నగర పాలక సంస్థ అధికారులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన సామగ్రిని బుధవారం నాటికి సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక నగరంలో కూలడానికి సిద్ధంగా ఉన్న శిథిలమైన వృక్షాలను గుర్తించడానికి అటవీ శాఖ మరియు నాగార్జున యునివర్సిటీ బోటనీ విభాగం అధ్యాపకుల సహకారం కోసం వారికి లేఖలు పంపాలన్నారు. అంతేకాక పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు సిబ్బంది నగరంలో శిథిలావస్తలో ఉన్న భవనాల జాబితాలను సిద్ధం చేసి, సదరు భవనాలను ఖాళీ చేయుటకు యజమానులకు నోటీసులను అందజేయాలన్నారు. అలాగే నగరంలో ఉన్నహోర్డింగ్స్ పై ద్రుష్టి సారించి, హోర్డింగ్స్ యొక్క స్ట్రక్చరల్ స్టేబిలిటి సర్టిఫికేట్లను సచివాలయాల వారీగా కార్యదర్శులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో బహులంతస్తుల భవన నిర్మాణాలు జరిగే సమయాల్లో పిల్లర్లు నిర్మించడానికి గుంటలు తీసే సమయాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ఆస్తి నష్టం మరియు ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సదరు సమావేశంలో డిప్యూటి కమిషనర్ సి.హెచ్ శ్రీనివాస్, యస్.ఈ జి. వెంకటేశ్వర రావు, డి.సి.పి సూరజ్ కుమార్, ఏ.డి.హెచ్ శాంతి, ఈ.ఈ వేణు, డి.ఈ.ఈ, ఏ.ఈ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన ఏబీసీ సెంటర్ పనులను పూర్తి చేయాలని కమిషనర్ కే. మయూర్ అశోక్ ఆదేశం.



గుంటూరు మే 30 నగరంలో నూతనగా నిర్మిస్తున్న రెండవ యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏ.బి.సి) సెంటర్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ నందు ఏ.బి.సి సెంటర్ నిర్మాణం పై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశం నందు తొలుత ప్రస్తుతం పొన్నూరు రోడ్డులో నిర్వహణలో ఉన్న ఏ.బి.సి సెంటర్ నందు రోజుకు ఎన్ని కుక్కలకు ఏ.బి.సి ఆపరేషన్ లు నిర్వహిస్తుంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, కుక్కలకు చికిత్సలను పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం నగర పాలక సంస్థకు కుక్కల వలన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై అధిక సంఖ్యలో పిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రజల నుండి వచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. కుక్కల పై వస్తున్న పిర్యాదులను తగ్గించుటకు నగరంలో మరో ఏ.బి.సి సెంటర్ ను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నామన్నారు. ప్రజల నుండి వస్తున్న పిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఏ.బి.సి ఆపరేషన్ ల సంఖ్యను పెంచాలని, ఆపరేషన్ పూర్తైన అనంతరం వాటిని ఎక్కడ పట్టుకొచ్చారో అక్కడే వదిలేయాలని ఆదేశించారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న ఏ.బి.సి సెంటర్ నిర్మాణ అనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, సదరు సెంటర్ నందు ఏ.బి.సి ఆపరేషన్లు నిర్వహించుటకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశం నందు డిప్యూటి కమిషనర్ బి. శ్రీనివాసరావు, యం.హెచ్.ఓ డాక్టర్ సురేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నాగేశ్వర రావు, డి.ఈ.ఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం పాల్గొన్న టీడీపీ నాయకులు



తనకల్లు మే30(భారత జ్యోతి) : కదిరి రూరల్ మండల పరిధిలోని కె బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దీన్నిమీదపల్లి గ్రామంలో ఉండే తెలుగుదేశం పార్టీ కార్యకర్త వీరాంజనేయులు గత కొన్ని రోజులు క్రితంఅనారోగ్యంతోమృతిచెందడు.సుదీర్ఘ కాలం పాటు టిడిపిలో పనిచేసిన చురుకైన కార్యకర్త వీరాంజనేయులు మృతి చెందడం పార్టీకి తీరనిలోటని టిడిపి నేత చిన్నానాయుడు ఆవేదన వ్యక్తపరుస్తూ గ్రామానికి వెళ్లి మృతిని కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు భారీ కృతజ్ఞత ర్యాలీ కార్యక్రమం




తనకల్లు మే30(భారత జ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ మహానాడులో మహిళలకు33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ ప్రకటించిన చారిత్రాత్మక నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం కదిరిలో మహిళలు భారీ కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు.కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని థ్యాంక్యూ సీఎం చంద్రబాబు నాయుడు,థ్యాంక్యూ లోకేష్, థ్యాంక్యూ కందికుంట వెంకట ప్రసాద్ అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు.మహిళా సాధికారతకు రాజకీయాల్లో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ:- మహిళలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించే ఈ నిర్ణయం చారిత్రత్మకమని భవిష్యత్ తరాల మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ర్యాలీ మొత్తం కృతజ్ఞత నినాదాలతో మార్మోగింది.ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 'సీఎం' గొడవ అయిపోయింది.. ఇప్పుడు 'డిప్యూటీ సీఎం' కోసం..



బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య తప్పుకోవడంతో డీకే శివకుమార్ త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పదవి కోసం కొందరు నేతలు పోటీ పడుతున్నారు. ఉప ముఖ్యమంత్రిగా మాజీ మంత్రి కేహెచ్ మునియప్పను నియమించాలని కోరుతూ దళిత వర్గ నేతలు శనివారం కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నిరసన చేపట్టారు. మడార మహాసభ, పలు దళిత సంఘాల నేతలు పోస్టర్లు ప్రదర్శిస్తూ మునియప్పకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరారు. రాష్ట్రానికి చేరుకుంటున్న ఏఐసీసీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాకు వినతిపత్రం అందించేందుకు నిరసనకారులు అక్కడికి వెళ్లారు. విమానాశ్రయంలోని టెర్మినల్ 1 వద్ద ఈ నిరసన కొన్ని గంటల పాటు కొనసాగింది. మడిగ వర్గానికి ఇప్పటివరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు వంటి కీలక పదవులు దక్కలేదని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఉప ముఖ్యమంత్రి పదవి ద్వారా తమ వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం తప్పదని హెచ్చరించారు. తమ వర్గాన్ని పట్టించుకోకపోతే పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సుర్జేవాలా నగరంలోని షాంగ్రి లా హోటల్‌కు చేరుకున్నారు. కర్ణాటక కాంగ్రెస్ శాసనసభ పక్షం (సీఎల్‌పీ) సమావేశంపై మునియప్ప మాట్లాడుతూ.. "కొంతమంది ప్రతిపాదిస్తున్నారు, మరికొందరు బలపరుస్తున్నారు. ఇదే విధానం. దీని కంటే ఎక్కువగా ఇప్పుడేమీ చెప్పలేం. అయితే ఈ ప్రక్రియ ఈ సాయంత్రానికే పూర్తవుతుంది" అని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వంపై ఒత్తిడి లింగాయత్ వర్గం నుంచి కూడా వచ్చింది. సీనియర్ నేత ఈశ్వర్ ఖంద్రేకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని గురు బసవ పట్టదేవరు, ఆయన అనుచరులు డిమాండ్ చేశారు. గురు బసవ మీడియాతో మాట్లాడుతూ.. "ఈశ్వర్ ఖంద్రేకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోతే వచ్చే శాసనసభ ఎన్నికల్లో లింగాయత్ వర్గం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుంది" అని అన్నారు. కాగా, కర్ణాటకలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల పేర్లు ప్రకటించే అవకాశం ఉంది.

## రాజస్థాన్‌లో రాకాసి ఇసుక తుపాను బీభత్సం



చురు జిల్లా: రాజస్థాన్‌లో రాకాసి ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. చురు జిల్లాలో ఇసుక తుపాన్‌తో పాటు భారీ వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చురు, బికనేర్, శ్రీగంగానగర్‌లో అరగంట పాటు ఇసుక తుపాన్ అల్లకల్లోలం సృష్టించింది. ఇసుక తుపాను వీధులను కమ్మేసింది. భారీ దుమ్ము కమ్మేయడంతో విజిబిలిటీ తగ్గిపోయింది. సోషల్ మీడియాలో దుమ్ము తుపాను సంబంధించి వీడియోలు వైరల్‌గా మారాయి. వీధుల గుండా బలమైన ఈదురుగాలులు, దట్టమైన దుమ్ము మేఘాలు కనిపించాయి. దీంతో ఆకాశం ముదురు నారింజ-గోధుమ రంగులోకి మారిపోయింది. ఒక్కసారిగా ఇసుక తుపానుతో ప్రయాణికులు స్థానికులు ఇళ్లలోనే ఆశ్రయం పొందారు. ఈదురుగాలుల ధాటికి చెట్లు నేలకొరిగాయి. ఈ ప్రాంతంలో తీవ్రమైన ఎండల తర్వాత బలమైన గాలులు, దుమ్ము తుపానులు ముంచెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర భారతదేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఎడారి వేడి గాలులు పరస్పరం చర్య జరిపినప్పుడు.. ముఖ్యంగా రుతుపవనాల ముందు వచ్చే ముందు రాజస్థాన్‌లో ఇటువంటి దుమ్ము తుపానులు సహజమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇసుక తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టంపై ఎలాంటి నివేదికలు అందలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తక్కువ విజిబిలిటీ ఉన్న సమయంలో అనవసరమైన ప్రయాణాలను చేయొద్దని.. వీలైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు, దుమ్ము లేచే పరిస్థితులు ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

## ఏపీకి బిగ్ అలర్ట్.. ఆ జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక



అమరావతి: రాయలసీమ జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది. రాగల మూడు గంటల్లో నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. 50-60కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని.. చెట్లు, పోల్స్, హోర్డింగ్స్ కింద నిలబడరాదని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. కాగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జూన్‌లోనూ వడగాడ్పుల రోజులు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇరు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని అంచనా వేసింది. ఏపీతోపాటు యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లలో సాధారణం కంటే ఎక్కువ వడగాడ్పుల రోజులు నమోదవుతాయని.. మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లోనూ వడగాడ్పుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంకన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా రుతుపవనాల వర్షపాత దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో 90 శాతంగా ఉండే అవకాశం ఉందని.. ఇది ఏప్రిల్‌లో అంచనా వేసిన 92 శాతం కంటే కూడా తక్కువని తాజా అంచనాలో పేర్కొంది. ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతుపవనాలపై పడటంతో మధ్యభారత్ సహా దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు, దేశ వాయవ్య ప్రాంతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.ు

## తెలంగాణ భవన్ వద్ద హైడ్రామా.. బాల్క సుమన్ అరెస్ట్



హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో బాల్క సుమన్‌పై పలు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తెలంగాణభవన్‌లో ఉన్న బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నరు. ఈ సందర్భంగా తెలంగాణభవన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం, బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గత మూడు రోజులుగా తెలంగాణ భవన్‌లోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణభవన్ వద్దనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత మూడు రోజులుగా మోహరించారు. బాల్క సుమన్ భవన్ నుండి బయటికి వస్తే అరెస్టు చేయాలన్న ఆలోచనలో పోలీసులు ఉన్నారు. ఈ క్రమంలో కాసేపటి క్రితమే సుమన్ తరపు లాయర్ అక్కడికి చేరుకున్నారు. అలాగే, నాంపల్లి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. సుమన్‌కు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు.. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు పోలీసులు. ?326, 351, 352, 353, 355, 361-దీమీ మరియు ూణుశా చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ?పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉన్న సెక్షన్లను కేసులో చేర్చిన పోలీసులు. దీంతో, పోలీసులతో బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వాగ్వాదానికి దిగారు. సుమన్‌పై అక్రమ కేసులు పెట్టారంటూ లాయర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ?నాంపల్లి కోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకుంటామంటున్నారు. ?అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటామని న్యాయవాదుల హెచ్చరించారు. ఈ క్రమంలో ?భవన్ వద్ద పోలీసులకు, లాయర్లకు మధ్య చర్చలు, వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## ప్రపంచాన్ని గెలిచారు.. ఇక మాతృభూమిని నడిపించండి!

'అమెరికా ఫస్ట్' నినాదంతో విదేశీయుల వల్ల స్థానికులకు ఉద్యోగాలు దక్కడం లేదనే వాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బలంగా వినిపిస్తుంటారు. ఈ క్రమంలోనే హెచ్-1బి వీసా నిబంధనలను కఠినతరం చేయడం, గ్రీన్ కార్డ్ జారీ ప్రక్రియలో జాప్యం వంటి నిర్ణయాలతో ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులను ఇబ్బందులకు గురిచేసే వ్యూహాన్ని అమెరికా అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, అమెరికాలో స్థిరపడిన భారతీయ మేధావులను, ప్రముఖ కంపెనీల సీఈవోలను 'తిరిగి భారత దేశానికి వచ్చేయండి.. ఇక్కడే అద్భుతాలు సాధించండి' అంటూ మన రాజకీయ శ్రేణుల నుంచి, సామాజిక మాధ్యమాల నుంచి పిలుపులు అందుతున్నాయి. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల సహా పలువురు గ్లోబల్ కంపెనీల సీఈవోలు ఇకనైనా ఇండియాకు రండి అని ఒక సీనియర్ పాత్రికేయుడు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే ఇవన్నీ భావోద్వేగపూరితమైన భ్రమలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే, విదేశాల్లోని మేధావులను ఆకర్షించడమనేది కేవలం పిలుపులతోనే సాధ్యం కాదు.. దానికి తగ్గ పారిశ్రామిక, పరిపాలనా పరమైన ఎకో సిస్టమ్ ఇక్కడ సిద్ధంగా ఉండాలి.

### చరిత్ర నేర్పిన పాఠాలు.. మారుతున్న కాలం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో విదేశాల్లో చదువు కున్న, స్థిరపడిన అనేకమంది మేధావులు మాతృభూమిపై మమకారంతో భారతదేశానికి తిరిగి వచ్చారు. నాటి హోమీ జహంగీర్ బాబా, విక్రమ్ సారాభాయ్ వంటి దిగ్గజాలు ఇక్కడికి వచ్చి అణుశక్తి, అంతరిక్ష రంగాలకు పునాదులు వేశారు. నాటి ప్రభుత్వాలు కూడా వారి ఆలోచనలకు పూర్తి స్వేచ్ఛను, గౌరవాన్ని ఇచ్చి ప్రోత్సహించాయి. అయితే, ఆ తర్వాత దశాబ్దాలలో దేశంలో పెరిగిన రెడ్ టేపిజం, లైసెన్స్ రాజ్ మౌలిక వసతుల లేమి, రాజకీయ జోక్యం కారణంగా దేశంలో 'మేధోవలస' భారీగా పెరిగింది. లక్షలాది మంది మేధావులు అమెరికా బాట పట్టారు. నేడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో లేదా గ్లోబల్ కంపెనీలలో భారతీయుల హవా నడుస్తున్నదంటే దానికి కారణం వారి ప్రతిభతో పాటు అమెరికా కల్పించిన స్థిరమైన వాతావరణం. నాడు వారు దేశాన్ని వదిలి వెళ్లడానికి కారణమైన సమస్యలను మనం పరిష్కరించామా? లేదా అనే ఆత్మపరిశీలన చేసుకోవాల్సి ఉంది.

### బలిపశువులవుతున్న పెట్టుబడిదారులు..

ఇండియాలో పెట్టుబడిదారులను తీవ్రంగా భయపెట్టే




ప్రధానాంశం 'పాలసీ అస్థిరత'. మన దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మునుపటి ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక విధానాలు, పన్ను నిబంధనలు, సబ్సిడీలు కూడా మారిపోతుంటాయి. డాలర్లలో సంపాదిస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యాపారాలు చేసే ఎన్‌ఆర్‌ఐలు, పెట్టుబడిదారులు ఇలాంటి అనిశ్చితిని అస్సలు భరించలేరు. అమెరికాలో ఆంక్షలకు భయపడి లక్షల రూపాయల ప్యాకేజీలను వదులుకుని ఇండియాకు వచ్చేసిన తర్వాత.. ఇక్కడ పాలసీలు తారుమారైతే వారు లీగల్ చిక్కుల్లో పడి, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ గ్లోబల్ మేధావులను ఇక్కడికి రమ్మనడం వారిని బలిపశువులను చేయడమే అవుతుంది. కనీసం 20 ఏళ్ల పాటు మారని స్థిరమైన పారిశ్రామిక విధానాన్ని చట్టబద్ధంగా మనమూ హామీ ఇస్తేనే ఎన్నారైలు ఇటువైపు చూడగలరు.

### వర్క్‌షాపులు.. పబ్లిక్ డొమైన్‌లో సమాచారం!

విదేశాల్లో ఉన్న నిపుణులను దేశానికి రప్పించాలనే సంకల్పం ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ఒక పద్ధతి ప్రకారం హోంవర్క్ చేయాలి. దేశంలో ప్రస్తుతం ఏ రకమైన పరిశ్రమలను ప్రభుత్వం తీవ్రంగా ప్రోత్సహించాలనుకుంటోంది? ఏయే రంగాలలో శాస్త్రవేత్తలు, సాంకేతిక మేధావుల కొరత తీవ్రంగా ఉంది? అనే అంశాలపై స్పష్టమైన సర్వేలు చేయాలి. దేశంలో ఉన్న అవకాశాలను ఒక శ్వేతపత్రం రూపంలో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. అమెరికాలో సరైన వీసా అవకాశాలు లేక, నిరంతరం గ్రీన్ కార్డ్ టెన్షన్‌తో గడుపుతూ తిరిగి వచ్చేయాలని భావించే మధ్యతరగతి నిపుణులు వేలల్లో ఉన్నారు. ఇక్కడ ఏ రంగంలో అవకాశాలు ఉన్నాయో అధికారికంగా స్పష్టత ఇస్తే, కనీసం ఈ వర్గం వారైనా ధైర్యంగా ఇండియాకు వచ్చి స్థిరపడేందుకు వీలవుతుంది.


### సీఈవోలు కాదు.. జీసీసీలు కావాలి!

అంతేకానీ, గ్లోబల్ టాప్ కంపెనీ సీఈవోలను తమ ఉద్యోగాలు, బోర్డు పదవులు వదిలేసి ఇండియాకు వచ్చే యమనడం అవగాహన లేమి లేదా మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే వారు గ్లోబల్ కార్పొరేట్ పబ్లిక్ లిస్టెడ్ కంపెనీల షేర్ హోల్డర్లకు జవాబుదారీగా ఉంటారు. వారు ఇండియాకు రావడం వల్ల దేశానికి వచ్చే లాభం కంటే, వారు ఉన్నత స్థానాల్లో ఉంటూ భారతదేశానికి లబ్ధి చేకూర్చే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం ఉత్తమం. దీనికి ప్రస్తుతం ఉన్న అత్యంత ఆచరణాత్మకమైన మార్గం 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్. అమెరికాలోని ప్రముఖ కంపెనీల సీఈవోలు వారి కంపెనీల తరపున హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలలో భారీ ఎత్తున గ్లోబల్ సెంటర్లను ఏర్పాటు చేసేలా మనం ప్రోత్సాహకాలు ఇచ్చి ఆహ్వానించవచ్చు. ఈ జీసీసీల ద్వారా అమెరికా కంపెనీలు తమ అత్యున్నత సాంకేతిక పరిశోధనలను ఇక్కడి నుంచే నిర్వహిస్తాయి. మనుషులు దేశం దాటి వెళ్లకుండానే, ఇక్కడి టాలెంట్‌కు అంతర్జాతీయ స్థాయి ఉపాధి లభిస్తుంది.

### నేటికీ యువతలో డాలర్ కలలు..

మన సామాజిక వైరుధ్యాన్ని కూడా ఈ సందర్భంగా గమనించాలి. మనవాళ్లకు క్షేత్రస్థాయిలో అమెరికా మోజు ఏమాత్రం తగ్గలేదు. నేటికీ అమెరికా నుంచి ఎవరైనా బంధువులో, మిత్రులో భారతదేశానికి వస్తే, వారిని కలిసే వంద మందిలో కనీసం తొంభై మంది 'మా అబ్బాయికో, అమ్మాయికో అమెరికాలో ఏదైనా అవకాశం ఉంటే చూడండి' అని అడుగుతున్నారనేది నగ్నసత్యం. ఒకవైపు ఇక్కడి సమాజంలో అమెరికా వీసా పట్ల ఇంతటి తీవ్రమైన వ్యామోహం, ఆరాటం ఉంచుకుని, మరోవైపు అమెరికాలో ఉన్నవారిని ఇక్కడికి వచ్చేయ మనడం ద్వంద్వ నీతి అవుతుంది. భారత్ నిజంగానే గ్లోబల్ లీడర్ కావాలంటే, విదేశాల్లో ఉన్నవారిని భౌతికంగా రమ్మని కోరడం కంటే.. వారి పెట్టుబడులను, మేధస్సును, డిజిటల్ ఐడియాలను సులువుగా ఆకర్షిం చగలిగే లీగల్, పరిపాలనాపరమైన బలమైన ఎకో సిస్టమ్‌ను నిర్మించడమే ఏకైక మార్గం.

## షైనింగ్ హైదరాబాద్.. సఫరింగ్ తెలంగాణ? ఉద్యమ లక్ష్యాలకు దూరంలోనే రాష్ట్రం!



తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం కేవలం భౌగోళిక సరిహద్దుల కోసం జరిగిన పోరాటం కాదు. అది దశాబ్దాలుగా కొనసాగిన ప్రాంతీయ వివక్ష, అన్యాయం, నిర్లక్ష్యం, అవకాశాల అసమాన పంపిణీకి వ్యతిరేకంగా ప్రజలు రేపిన చారిత్రాత్మక ఉద్యమం. "మన నీళ్లు - మన నిధులు - మన నియామకాలు" అనే నినాదం వెనుక తెలంగాణ గ్రామాల బాధ, రైతు ఆవేదన, నిరుద్యోగ యువత ఆకాంక్ష, స్వాభిమానం దాగి ఉన్నాయి. రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు దాటుతున్న ఈ సమయంలో తెలంగాణ నిజంగా ఉద్యమ లక్ష్యాల దిశగా నడుస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు సమాజం ముందుంది. ఒకవైపు హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా మెరుస్తుంటే, మరోవైపు గ్రామీణ తెలంగాణ ఇంకా అప్పులు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ రంగాల బలహీనతలతో పోరాడుతోంది. అభివృద్ధి మొత్తం ఒక నగరంలోనే కేంద్రీకృతమవుతుంటే, ఉద్యమం ఆశించిన సమాన తెలంగాణ సాధ్యమవుతుందా? అన్న చర్చ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

### అభివృద్ధి చిన్న గ్రామాలకు విస్తరించాలి!

హైదరాబాద్ నేడు ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగి తెలంగాణకు ఐటీ, పెట్టుబడులు, ఉద్యోగాల్లో భారీ వృద్ధిని తీసుకొచ్చింది. కానీ ఈ అభివృద్ధి ఎక్కువగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. అంటే అభివృద్ధి రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరణ కాకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేంద్రీకృతమవుతోంది. ప్రభుత్వాలు కూడా ఈ అభివృద్ధినే "తెలంగాణ ప్రగతి"గా ప్రజలకు చూపిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి మొత్తం రాష్ట్రానికి సమానంగా విస్తరించిందా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సి ఉంది. విదేశీ పెట్టుబడులు, ఐటీ ఎగుమతులు, రియల్ ఎస్టేట్ బూమ్, అంతర్జాతీయ సదస్సులు ఇవన్నీ హైదరాబాద్‌కు ఒక కొత్త గుర్తింపును తెచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ అదే సమయంలో గ్రామీణ తెలంగాణ పరిస్థితి ఏమిటి? వారు ఇప్పటికీ వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతుంటే, చిన్న రైతు అప్పుల కోసం తన భూమినే అమ్ముకోవాల్సి వస్తోంది. ఇది సమగ్ర అభివృద్ధి కాదు, అసమాన అభివృద్ధి. నిజమైన తెలంగాణ ప్రగతి అంటే అభివృద్ధి గ్రామాలు, చిన్న పట్టణాలకు కూడా సమానంగా విస్తరించాలి.

### యువత గిగ్ వర్క్ మీదే ఆధారపడుకుంటూ..

ప్రభుత్వ వైద్య రంగంలో పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. రాష్ట్రంలో వేలాది డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండ టంతో గ్రామీణ ప్రజలు సరైన వైద్యం కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఒకవైపు "ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిర్మిస్తున్నామని చెప్పే ప్రభు త్వాలు, గ్రామీణ ఆసుపత్రుల్లో ఒక్క డాక్టర్ కూడా లేక ప్రజలు కిలోమీటర్ల దూరం ప్రయాణించే పరిస్థితిని ఎందుకు మార్చలేకపోతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన ఉద్యోగాల హామీలపై యువత పెద్ద ఆశలు పెట్టుకుంది. కానీ నిరుద్యోగం ఇంకా ప్రధాన సమస్యగానే ఉంది. తెలంగాణాలో ఐటీ రంగం లక్షల కోట్లకు పెరుగుతున్నప్పటికీ, చాలామంది యువత చిన్న ప్రైవేట్ ఉద్యోగాలు, గిగ్ వర్క్, డెలివరీ, కాంట్రాక్ట్ పనులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వ రంగంలో కూడా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం పెరగడంతో తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, కార్మిక హక్కులు బలహీనపడటం వంటి సమస్యలు మరింత పెరుగుతున్నాయి.

### జీడీపీ పెరగడమే అభివృద్ధి కాదు..

పాలకులు చెబుతున్న అభివృద్ధి ఎక్కువగా కార్పొరేట్, మార్కెట్ కేంద్రితంగా మారిందనే విమర్శలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, గ్రామీణ తెలంగాణ మాత్రం అప్పులు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభంతోనే పోరాడుతోంది. జీడీపీ గణాంకాలు పెరగడం మాత్రమే అభివృద్ధి కాదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. రైతుకు గౌరవప్రదమైన జీవితం, యువతకు స్థిరమైన ఉద్యోగాలు, అందరికీ విద్యా-వైద్య సదుపాయాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఒకవైపు సంపద కేంద్రీకృతమవుతుంటే, మరోవైపు గ్రామీణ పేదరికం పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో సామాజిక అసంతృప్తికి దారితీయొచ్చు.

### స్వరాష్ట్ర ఉద్యమం సమసమాజం కోసం..

అందుకే ప్రభుత్వాలు నగర కేంద్రిత అభివృద్ధి నుంచి బయటకు రావాలి. గ్రామీణ పునర్నిర్మాణం, వ్యవసాయ రంగ బలోపేతం, ప్రభుత్వ రంగ ఉద్యోగాలు, చిన్న పరి శ్రమలు, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల అభివృద్ధి ఇవే తెలంగాణ భవిష్యత్తుకు నిజమైన పునాదులు కావాలి. లేకపోతే రేపటి తెలంగాణ రెండు వేర్వేరు ప్రపంచాలుగా మారిపోతుంది. ఒకటి షైనింగ్ హైదరాబాద్, మరొకటి సఫరింగ్ తెలంగాణ.. తెలంగాణ ఉద్యమం చేసింది కేవలం ఒక నగరం కోసం కాదు.. ఒక సమాన సమాజం కోసం. హైదరాబాద్ వెలుగులు గ్రామీణ తెలంగాణ చీకట్లను కప్పిపుచ్చలేవు. గ్రామీణ తెలంగాణ బలపడినప్పుడే.. తెలంగాణ నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుంది.

## మహానాడు!

మహానాడు పేరిట తెలుగుదేశం పార్టీ వార్షిక సమావేశాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా 1875 చోట్ల హైబ్రిడ్ విధానంలో మే 27, 28 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించారు. చట్ట సభల్లో పోటీ చేయడానికి మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని మహానాడు వేదికగా ప్రకటించడం ముదావహం. యువతకు పెద్ద పీట వేస్తామనడం మంచి విషయమే! ఆ పార్టీ వ్యవస్థాపకుడు తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి రామారావుకు భారత రత్న ప్రదానం చేయాలని మరోసారి తీర్మానించడం స్వాగతించదగినదే! ఆ మహనీయుని బహుదా ప్రస్తుతించిన మహానాడులో ఆయన ప్రవచించిన సిద్ధాంతాలు, విధానాలను గురించి విస్మరించడం విచారించ వలసిన విషయం. ఎన్ టి రామారావు పేరెత్తితేనే తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదం మన చెవుల్లో గింగురుమంటుంది. ఆనాడు తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ పాలకులకు తాకట్టు పెట్టిన దుష్ట కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎక్కుపెట్టిన శంఖారావమే కేవలం తొమ్మిది నెలల్లో అధికార పీఠానికి బాటలు వేసింది. రాష్ట్రాల హక్కుల కోసం పరితపించిన ఎన్ టి ఆర్ వివిధ ప్రతిపక్ష పార్టీలతో శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించారు. ఫెడరలిజం పరిరక్షణ ఆయన విధానంగా ఉండేది. కాగా అన్యాయంగా విభజించిన రాష్ట్రానికి మాటిచ్చిన ప్రత్యేక హోదాను, విభజన హామీలను తిరస్కరించిన బిజెపి తో జట్టు కట్టిన టిడిపి నేతలు ఆ వేదిక ద్వారా దాన్ని సమర్థించుకోవడం ఎన్ టి ఆర్ వారసత్వం ఎలా అవుతుంది? గవర్నర్ రాంలాల్ ద్వారా ఎన్ టి ఆర్ ను పదవీచ్యుతుడ్ని గావించిన కేంద్ర ప్రభుత్వ దాష్టీకాన్ని ఇప్పుడు మరింత దారుణంగా అమలు చేస్తున్న మోడీ-షా ద్వయాన్ని ఆకాశానికెత్తడం తారక రాముని ఆశయాలకు పూర్తి విరుద్ధం. ?మత సామరస్యాన్ని నిలబెట్టడానికి మైనారిటీలకు రక్షణ కల్పించడానికి ఎన్ టి ఆర్ కృషి చేశారు. దేశంలో మత సామరస్య పరిరక్షణకు ఆనాటి విధ్వంసకర రథయాత్రను వ్యతిరేకించారు. అలాంటి చరిత్ర గల టిడిపి ఈనాడు మత విద్వేషాన్ని రగుల్చుతున్న బిజెపి తో చెలిమి చేయడాన్ని ఎలా సమర్థించుకుంటారు? బిజెపి తెచ్చిన వినాశకర వక్ఫ్ బిల్లును పార్లమెంటులో టిడిపి బలపరచడం దారుణం. టిడిపి తీర్థం పుచ్చుకున్న ఉండి ఎం ఎల్ ఏ ఆకివీడు దళితవాడలో గొంతేనమ్మ గుడి కూల్చుతామని వీరంగం వేయడం, మరోవైపు కడపలో విద్వేష వివాదాల సృష్టి వంటివి కూటమిలో పరివార్ శక్తుల భాగస్వామ్యం ఉండడం వల్లనే పెచ్చరిల్లుతున్నాయి కదా! ఆరు నెలలు స్నేహం చేస్తే వారు వీరవుతారు అన్న మాదిరిగా సాక్షాత్తు చట్ట సభల్లో టిడిపి ముఖ్య నాయకులే మతం ప్రస్తావన చేసిన దుస్థితి గురించి మహానాడులో సమీక్షించారా? తెలుగు దేశం పార్టీ జెండా




రూపకల్పనలో నాగలి రైతులకు చక్రం కార్మికులకు ప్రతీకగా ఆనాడు పేర్కొన్నారు. కానీ ఈనాటి కూటమి పాలనలో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కాదు సరికదా మద్దతు ధరనైనా కల్పిస్తున్నారా? ఎల్లవేళలా కార్పొరేట్ల భజన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనడమే తప్ప కార్మిక సంక్షేమం ఊసెత్తుతున్నారా ? పొరుగు రాష్ట్రం ప్రకటించిన తరువాతయినా ఈ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు గురించి కనీసంగా ఆలోచించదా? మరి ఆ పతాకానికి, అందులోని చిహ్నాలకీ విలువేమిటి అని నిజాయితీ గల టిడిపి కార్యకర్తలు ప్రశ్నిస్తే ఏలికలేం చెబుతారు? ?అయితే, బిజెపితో చెట్టపట్టాలు వేసుకుంటున్నప్పటికీ దేశమంతటా వారు తెచ్చి పెట్టిన వివాదాస్పద ఎస్ ఐ ఆర్ గురించి అప్రమత్తంగా వుండాలని టిడిపి అధినేత తమ కార్యకర్తలకు హెచ్చరించడం, ఆ ప్రమాదాన్ని గుర్తించడం బాగానే వుంది. అదే విధంగా వినాశకర కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎన్ టి ఆర్ జపం చేయడం మాత్రమే గాక అయన అనుసరించిన విధానాలను అమలు చేయడానికి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి టిడిపి కృషి చేయాలి. అదే ఎన్ టి ఆర్ కి నిజమైన నివాళి అవుతుంది.

Published & Owner, Editor: Ch Jangaiah, Printing at Swarna Bharatha Jyothi Printers, Office Address. H.no. 7-2-B6/3/4 Malikarjuna nagar, Bairamalguda, Sagar Ring road, L.B.Nagar, Telangana, RNI No. APTEL/2007/20124, Cell: 9666282126, Email:swarnabharathajyothi2024@ gmail.com, Website: www.swarnabharathajyothi.com